క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

● ఎంఈఓ గౌరునాయుడు



కంబరవలస కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గౌరునాయుడు

వీరఘట్టం: తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ డి.గౌరునాయుడు ఆదేశించారు. మండలంలోని కంబరవలస ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు హాజరుకాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లి దండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలన్నారు. అలాగే వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, టివాడ, కత్తులకవిటి ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్, ఎస్జీటీ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.

వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

భామిని: మండలంలోని బాలేరులో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు శనివారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు స్వాతి, చరిష్మా, తదితరులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కురుపాంలో వెలిసిన కోటదుర్గా దేవి

కురుపాం: మండల కేంద్రంలోని కోట వద్ద (కోట దుర్గాదేవి ఆలయం) ఈ నెల 22వ తేదీ అక్టోబర్ 2 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాసనాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ప్రముఖ యజ్ఞకర్త శర్మయాజీ, వరుగుల సుధామాధవ శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు.

పుస్తకాల వితరణ



శాఖా గ్రంథాలయానికి అందించిన పుస్తకాలతో పూర్వపు విద్యార్థులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయానికి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో పాటు ఇంటర్ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను 1987 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు వితరణగా అందించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరు శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం పట్టణానికి చేరుకున్నారు. ఈ క్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబును కలిసి పుస్తకాలతో పాటు వాటిని భద్రపర్చే స్టాండ్‌ను అందించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మండపాక రామ్‌గోపాల్, టి.ఉమామహేశ్వరరావు, బలివాడ శ్రీధర్, పైల శశిధర్, మల్లికార్జునరావు, తదితరులు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి ప్రసాదం వడ్డించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయంకిటకిటలాడింది.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

గరుగుబిల్లి: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా, తరలించినా కఠిన చర్య లు తీసుకుంటామని చెప్పారు. అలాగే మద్యంషాపుల్లో కూడా ఎంఆర్‌పీకి మించి విక్రయాలు చేపట్టరాదన్నారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, సారా తయారు చేసినా 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కురుపాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శైలజ కోరారు. మండలంలోని దండుసూర గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే పాల ఉత్పత్తిపై పలు సూచనలు చేశారు.

పురటాళ్ల పోలమాంబ, నీలమాంబ ఆలయాల్లో..

శరన్నవరాత్రి ఉత్సవాలు

● చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు
● ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పాలకొండ రూరల్:

పట్టణంలోని నాగవంశపు వీధిలో కొలువై.. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రజలచే కీర్తించబడుతున్న పురటాళ్ల పోలమాంబ ఆలయంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారిలో గల ఈ ఆలయంలో నవరాత్రులను ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో మాదిరిగానే ఇక్కడి అమ్మవారికి కూడా నిత్యపూజలు, అవతారాలతో పాటు ఉత్సవాలు నిర్వహించడం పరిపాటి. సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న అమ్మవారిని స్థానిక నాగవంశీకులు కులదైవంగా ఆరాధిస్తారు. విజయ దశమిని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ ఉదయం నిర్దేశిత శుభలగ్నమందు ఉత్సవాలకు సంబంధించి ముహూర్తపు రాట వేయనున్నారు. అనంతరం శుభ స్తంభ, అమ్మవారి కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపడతారు. 11 రోజులు జరగనున్న ఉత్సవాలు వచ్చేనెల 2వ తేదీ విజయదశమి వరకు కొనసాగనున్నాయి. అదే రోజు అశేష జనవాహిని నడుమ అమ్మవారి మహా తిరువీధి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సవకాలంలో అమ్మవారికి చేపట్టే నిత్య పూజలు, ఘటాల సందర్శనకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవ కాలంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక కుంకుమపూజలు చేపట్టనున్నట్లు అర్చకులు వేమకోటి రవిబాబు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 30న నాగవంశీకులు 2,116ఘటాలతో ప్రత్యేక ఉత్సవంచేపట్టనున్నారు.



శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన పురటాళ్ల పోలమాంబ

నమ్మకమైన తల్లి.....

ముగ్గురమ్మల మూలపుటమ్మ...నమ్మకమైన తల్లి నీలమాంబ ఆలయంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లును శరవేగంగా చేపడుతున్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రికి అతి సమీపంలో కొలువైన అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆ ప్రాంత భక్తులు, నీలమ్మ కాలనీవాసులు సిద్ధమవుతున్నారు. అర్చకులు సత్యకూర్మనాథశర్మ నేతృత్వంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతమంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



భక్తుల కొంగుబంగారమైన నీలమాంబ

పోరాటానికి సిద్ధంకండి

● రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంటు దాసు

కొమరాడ: రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి సోమనాథ్ కమిటీ సిఫార్సులు అమలు చేసేవరకూ రైతులు పోరాడాలని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంటు దాసు పిలుపునిచ్చారు. మండలంలోని కళ్లికోటలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రైతు మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేలా చట్టాలు తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. రైతులకు ఇబ్బంది కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో పుష్కలంగా నీటి వనరులున్నా సాగునీరు అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జంఝావతి, గుమ్మడిగెడ్డ, తోటపల్లి, హడారిగెడ్డ, వనకబడి లాంటి పెండింగ్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఏడాదీ ఏనుగుల వల్ల పంటలు నాశనమవుతున్నాయని, ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంటు దాసు

ముగిసిన విశ్వకర్మ ఉత్సవాలు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ త్రిరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు విగ్రహాన్ని మేళతాళాల నడుమ ఊరేగించి, అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు చింతాడ ప్రసాద్, సురేష్, బి.శివ, తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని కీసరజోడు జంక్షన్ వద్ద 20 లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కీసరజోడు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒక వ్యక్తిని తనిఖీ చేయగా సారా పట్టుబడిందన్నారు. సారాను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వాడవాడలా

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలు



కురుపాం: ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు

కురుపాం: మండల కేంద్రంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి కురుపాం బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది, ఆదర్శ పాఠశాల, జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

సీతంపేట: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీపీఎం రమణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వెలుగు శాఖ కార్యాలయం ఆవరణలో శనివారం ఒమక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం కమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం..

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేద్దామని పాలకొండ సబ్‌జైల్ సూపరింటిండెంట్ బి.జోగులు అన్నారు. సర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జైల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, హెడ్ వార్డర్ బి.వి జయకుమార్, సిబ్బంది నరసింహులు, హరికృష్ణ, సత్యారావు, తదితరులున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి..

గరుగుబిల్లి: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని రావివలస పీహెచ్‌సీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆవరణ ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, డాక్టర్ సూర్యకౌశిక్, పీహెచ్‌సీ వైద్యాధికారి కె. కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిక్షణ..

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి తెలిపారు. మండల కేంద్రంలో వెలుగు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందితో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీఓ ఎల్. గోపాలరావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: రావివలస పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



సీతంపేట: వెలుగు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది



పాలకొండ రూరల్: మొక్క నాటుతున్న జైల్ అధికారులు, సిబ్బంది

అభినందనలు..

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మావిడి శ్రీనివాసరావు మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్టీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజులను చినమేరంగి క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఇంతటి బాధ్యత అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మావిడి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని చెప్పారు.



పరీక్షిత్ రాజు దంపతులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మావిడి శ్రీనివాసరావు

నూతన కౌలు చట్టం తీసుకురావాలి

బలిజిపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నూతన కౌలు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20వేలు వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవు సాంబమూర్తి, రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 22న చలో అసెంబ్లీ కార్యక్రమానికి రైతులు రావాలని కోరుతూ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతుల పట్ల ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పాత చట్టంలో లోపాలను సవరించి కొత్త చట్టం చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పటికీ ఏమి చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పిన నాయకులు దానిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. వీటిని అమలు పరచాలని చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



అంపావల్లిలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సీతానగరం: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీ మహిళలు, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో వైద్య శిబిరాలను సీహెచ్‌వో ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

యువతను అరెస్ట్ చేయడం తగదు



గంగునాయుడు

జియ్యమ్మవలస రూరల్: డీఎస్సీలో తమకు అన్యాయం జరిగిందంటూ స్పెషల్ డీఎస్సీ కోసం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రికి వినతి ఇచ్చేందుకు వెళ్తే యువకులను అరెస్ట్ చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తక్షణమే స్పెషల్ డీఎస్సీ ప్రకటించి గిరిజనులతోనే ఆ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 3 స్థానంలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి గిరిజన ప్రాంత ఉద్యోగులను వారితోనే భర్తీ చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చుకోవాలన్నారు.

తోటపల్లికి భక్తుల తాకిడి

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం సుప్రభాత సేవ, తదితర కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రావుపల్లి, బాసంగి గ్రామాలకు చెందిన శ్రీవారి సేవకులు భక్తులకు అవసరమైన సేవలను అందించారు. అలాగే మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు.

నిర్బంధాలు తగవు

గుమ్మలక్ష్మీపురం: చలో సాలూరు కార్యక్రమంలో పాల్గొనకుండా తమను నిర్బంధించడం తగదని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు అన్నారు. గిరిజన నిరుద్యోగుల సంఘం పిలుపు మేరకు ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, వంద శాతం పోస్టులు స్థానిక గిరిజనులకే కేటాయించాలన్న డిమాండ్లతో చలో సాలూరు కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం వెళ్లనున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు వారిని పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వద్ద నాయకులను ఎల్విన్‌పేట పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు, కురుపాలం నియోజకవర్గాల్లో జరిగిన ప్రచార సభల్లో లక్షలాది మంది గిరిజనుల సాక్షిగా జీఓ3కు చట్టబద్ధత తీసుకువస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకు ఆ హామీ నెరవేర్చలేదన్నారు. గిరిజనులు, గిరిజన విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నా గిరిజనశాఖ మంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు.

గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన బాలికల గురుకుల కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల పోస్టులు.. బాలుర కళాశాలలో ఫిజిక్స్ పోస్టు.. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జువాలజీ పోస్టులు.. అలాగే బాలుర కళాశాలలో ఎకనామిక్స్ పోస్టు.. కురుపాం గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంగ్లిష్, ఫిజిక్స్ పోస్టులు.. సీతానగరం మండలం జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తెలుగు సబ్జెక్ట్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరారు.

నాటిక పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పుష్పశ్రీవాణి దంపతులు

జియ్యమ్మవలస: మండలంలోని మేరంగి నాటక పరిషత్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నవంబర్ 7,8,9 తేదీలలో నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు చేతులమీదుగా చినమేరంగిలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న కళాకారులు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహ అధ్యక్షుడు వాన నారాయణరావు, ప్రధాన కార్యదర్శి రౌతు విజయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరడాన కిశోర్, బలగ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● ఏఐఎస్ఎఫ్ నాయకులు

కురుపాం: ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను కూటమి నాయకులు వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు చరణ్, కార్యదర్శి వికాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామన్న లోకేష్ అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6500 కోట్లు విడుదల చేయాలని కోరారు. అలాగే ఉన్నత విద్యకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేయాలని.. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3500 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని ఎడల విడతల వారీగా ఆందోళన చేపడతామన్నారు. నిరసన ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● ఎంపీడీఓ రమేష్

కొమరాడ: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగారేగువలస, ఆర్తాం గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు ఎటువంటి వ్యాధులు దరి చేరవన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా పతినిధులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గంగారేగువలసలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ రమేష్, తదితరులు

పని గంటలు పెంచడం దుర్మార్గం

పాలకొండ: కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని కాలాన్ని 13 గంటలకు పెంచడం సరికాదన్నారు. కార్మిక, ప్రజా, ఉద్యోగ, కర్షక వ్యతిరేఖ విధానాలతో కూటమి ప్రభుత్వం తన పతనం తానే కోరుకుంటోందన్నారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు కాద రాము, పి. రమణ, ఎ. ఈశ్వరరావు, ఎ.ధనుంజయరావు, ఎస్. గంగరాజు, ఎస్. బాలరాజు, ఎ. రవికుమార్, ఎల్. కామేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

హెల్మెట్ తప్పనిసరి

గరుగుబిల్లి: వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఫకృద్దీన్ స్పష్టం చేశారు. ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు.



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఫకృద్దీన్